# గంధపుచెట్టు

— దేవరకొండ గంగాధర రామారావు

**నా నోరు మూతపడి పోయింది. తల వాలిపోయింది. ఆ రెండూ చేయలేను. సలహాలిచ్చేంత సహృదయం ఉందికానీ గాంధారిలా అంత త్యాగంచేసే ఆత్మశక్తి లేదు. అప్పుడే అర్థమైంది అందరూ గాంధీ లెందు కవలేదో!**

రిక్షావాడు మరీ ఇరుకుసందుల్లోంచి లాక్కుపోతూ ఉంటే నాకు వాడు చూపిస్తానన్న స్వర్గంకన్నా నరకమే ఎదురౌతుందనిపించింది. 'పిల్ల మంచి మజాగా వుంటుంది సార్. ఫ్యామిలీ గరల్ సార్. సరుకు చాలా కొత్త సార్' అంటూ కొద్ది నిమిషాల్లో కిరాయికి నా ఒడిలో వాలిపోయే ఆ అభాగ్యురాలి సౌందర్యం దారి పొడుగునా వర్ణిస్తూనే ఉన్నాడు.

రక్తమాంసాలతో, రాగద్వేషాలతో చైతన్యమూర్తులైన మనుషుల్ని 'సరుకు' స్థాయికి రిక్షావాడు దించి మాట్లాడడం నాకు బాధ కలిగించింది. అంతలోనే అన్నయ్య పెళ్ళి సందర్భంలో అమ్మా, నాన్నా అన్న మాటలు బుర్రలో గింగురుమన్నాయి. 'మనబ్బాయికేవండీ... బంగారం. ఇంజనీరింగ్ పాసయ్యాడు. లక్షకి వాళ్ళే వేస్తారు. మీరు రేటుచెప్పకండి. సరుకు మంచిదైనప్పుడు మనమెందుకు తగ్గాలి?'. కట్నాల మార్కెట్‌లో మా అన్నయ్య సరుకు. నాలాంటి వ్యభిచారులున్న ఈ మార్కెట్‌లో అమ్మాయి సరుకు. ఒక్కటే తేడా అన్నయ్య నీతిలేని సరుకు. ఇక్కడ అమ్మాయి గతిలేని సరుకు.

రిక్షా ఓ పాత పెంకుటింటి ముందు ఆగింది. రిక్షావాడు ఇంటి యజమానురాలు ఏదో మాట్లాడుకున్నాక నన్ను ఆమె ఓ గదిలోకి పంపింది. "అమ్మాయిని పిలిపిస్తా. ఇలా కూర్చోండి" అని ఓ కుర్చీ చూపించి తలుపు వేరవేసి వెళ్ళింది. ఆ గది చూస్తే ఆవిడ ఇంట్లో ఒక గది ఇలాంటి వ్యాపారానికి అవసరాన్నిబట్టి అద్దెకిస్తుంటుందని తెలిసింది. పాత పందిరిమంచం, మంచం కింది, బియ్యం డబ్బాలు, కొన్ని బస్తాలు, ఓ మూల గోడవారగా పేర్చిన ట్రంకులు, లేసు కర్టెనులు గోడమీద ఏ వ్యాపారికైనా అభయమిచ్చే వెంకటేశ్వర్లువారి ఫోటో, అన్నీ చూస్తూ ఏమీ చేయలేని త్రిమూర్తుల ఫోటో, భజరంగబళి, ఒకటేమిటి సమాజంలోవున్న మంచి విలువలు నిదర్శనంగా అన్నీవున్నాయి ఆ గదిలో.

అరగంటయినా అమ్మాయి రాలేదు. ఆ గదిలో వాతావరణం కంపరం పుట్టిస్తోంది. పాతిక రూపాయలకు స్వర్గసౌఖ్యం అనుభవించాలని ఆశించిన నా కక్కుర్తికి సిగ్గుపడ్డాను. ఏ కురూపి కౌగిలిలో నలిగిపోతానో అని భయపడ్డాను. ఇంతలో ఒక అమ్మాయి తలుపు తోసుకొని ఒక్క గంతులో నా గదిలోకి వచ్చిపడింది. పరుగున వచ్చినట్టుంది కొంచెం ఆయాస పడుతోంది.

ఆ పిల్ల గదిలో అడుగు పెట్టగానే ఒక్కసారి గదంతా వెలిగినట్టయింది. ఆమె యౌవనం, శిల్పసదృశమైన అంగసౌష్టవం నన్ను ముగ్దుణ్ని చేశాయి. కర్తవ్య విమూఢుణ్ని చేశాయి. ఈ మురికికూపంలో ఎక్కడిదీ సౌందర్యరాశి! ఆమె తలవాల్చుకుని తన ఆలస్యానికి కారణాలు చెప్పుకుని క్షమాపణ వేడుకొంది. సాధారణంగా 'పాసింజర్లు' నా అంత ఓర్పుగా వేచివుండరు. ఆమె ఆలస్యానికి కారణం తల్లి అనారోగ్యం. అప్పటికి ఆరునెలలుగా క్యాన్సరు వ్యాధితో బాధపడుతున్న తల్లికి హఠాత్తుగా నొప్పి ముంచుకొచ్చింది. ఆమెకు సేవచేసి రావడంలో ఆలస్యం అయింది.

అది విన్న నేను నీరైపోయాను. అంత దయనీయమైన స్థితిలో వచ్చిన ఆమెను నేనెల్లా అనుభవించను? ఆమె దౌర్భాగ్యంలోంచి నా భోగానికి ఎలా వంతెన కట్టను? ఆమెతో అదే అన్నాను. "నువ్వు వెళ్ళిపో. మీ అమ్మ ఆరోగ్యం చూసుకో. నేను మరోసారి వస్తానులే" అని లేచాను.

"మీరిచ్చిన డబ్బు?" అమ్మాయి సందిగ్ధంగా అడిగింది.

"ఫరవాలేదు ఉండనీ!" అని కదలబోయాను.

ఆ అమ్మాయి కఠినంగా అంది. "వద్దులెండి మాకు ఉచితంగా మీ సహాయంవద్దు. అదీకాక వెయ్యిమందిలో ఒకరు ఇలా దానం చేసినా మా కష్టాలు గట్టెక్కవ్!"

నా వీపుమీద ఒక్క చురక వేసినట్టయింది. వెనక్కు తిరిగి ఆమెవైపు నడిచాను. ఆమె తన మృదువైన చేతులలో నన్నదిమి పట్టుకుంది. ఆమె కౌగిలిలో పరవశించాను. ఆ రాత్రి స్వర్గమే నా పాదాలముందర వాలినట్టయింది.

'మళ్ళీ రేపే వస్తాను. ముందుగా ఎవరికీ బుక్ అవకు' అని హెచ్చరించి ఇంటికి నడిచా. ఒక పెద్ద ప్రశ్న మాత్రం నా బుర్రలో బరువుగా పేరుకుంది.

'ఆమె బ్రతుకిలా కుళ్ళిపోవలసిందేనా?'

మర్నాడు మళ్ళీ వెళ్ళాను. ఈసారి ఆమె నాకోసం ఎదురుచూస్తూ కూర్చుంది. ఈ ప్యాసింజర్‌కి ఆ మాత్రం గౌరవం ఇచ్చినందుకు సంతోషించాను. వెళ్ళగానే నాకు టీ ఇచ్చింది. దొడ్డివైపు కుర్చీలలో కూర్చుని చాలాసేపు మాట్లాడుకున్నాం. ఆమె ఎందుకీ వృత్తి చేపట్టిందని అడిగాను. అలాంటి ప్రశ్నకోసమే ఎదురుచూస్తున్నట్లు ఆమె ఆవేదనతో తన కష్టాలు చెప్పుకుంది.

ఆమె తండ్రి ఉద్యోగంలో ఉన్నన్నాళ్ళు వాళ్ళ కుటుంబం గౌరవంగానే బతికారు. తరువాత తండ్రి రిటైర్ అయిపోయారు. ఉన్న డబ్బంతా అయిపోయింది తండ్రి హఠాత్తుగా చనిపోయాడు. తల్లికి అప్పటికే క్యాన్సరు ముదిరిపోయింది. తమ్ముడూ, చెల్లివున్నారు. పదవ తరగతి చదువుతూ ఈ పరిస్థితిలో చదువుకు స్వస్తి చెప్పింది.

ఆమె నలుగురికీ తిండిపెట్టాలి. ఓ స్నేహితురాలి ప్రోత్సాహంతో ఈ దారి తొక్కింది. తిండి దొరికింది. ప్రాణాలు నిలబడ్డాయి. అంతేచాలు.

ఆమె తన కథ చెబుతూ ఏడ్చింది. నా మనసు వికలమైపోయింది. మామూలు కథే అంత మామూలు అయిపోవడంతోనే విషాదం అంతా నిండివుంది. ఇలా ఎందరు యువతులు శలభాల్లా ఈ సులభ సంపాదనకి బలైపోతున్నారో?

నేనొక ఆదర్శ ఉపాధ్యాయుడి పాత్ర అభినయించాను. ఆమెకు వేశ్యావృత్తిలోని నైచ్యాన్ని, ప్రమాదాల్ని, అనారోగ్యాన్ని గురించి ఎన్నో విషయాలు చెప్పాను. ఇప్పటికయినా మించిపోయింది లేదు. ఏదో గౌరవమైన వృత్తి చేపట్టి బ్రతుకు సరిదిద్దుకోమన్నాను.

టైపు, షార్ట్‌హాండ్ లాంటి చిన్నకోర్సులు చదువుకుంటానంటే ధనసహాయం కూడా చేస్తానన్నాను. ఈ మాటలకు ఆమె గుండెల్లో రేగిన మంటలు కళ్ళతో చిమ్ముతూ అంది. మీ కోర్సులు పూర్తయ్యేవరకు మా ప్రాణాలు నిలబడవ్. మా నలుగురి పోషణ బాధ్యత మీరు స్వీకరిస్తారా? నన్ను పెళ్ళి చేసుకుంటారా?

నా నోరు మూతపడిపోయింది. తల వాలిపోయింది. ఆ రెండూ చేయలేను. సలహాలిచ్చేంత సహృదయం ఉంది కానీ గాంధారిలా అంత త్యాగం చేసే ఆత్మశక్తి లేదు. అప్పుడే అర్థమైంది అందరూ గాంధీ లెందుకవలేరో!

ఈమెను చదివించి ఓ ఉద్యోగంలో చేర్చాలంటే మాటలా?

అంతవరకు నలుగురికి తిండి, బట్టా సమకూర్చాం అంటే మామూలా? ఇక పెళ్ళిమాటకొస్తే, ఒక పచ్చివేశ్యను, పవిత్రమైన నా భార్యగా ఎలా స్వీకరించగలను? ఇలా గుడిసెంలో దూరే నేను ఎలా పవిత్రమైన భర్త స్థానంలో నిలబడగలనో ఆ క్షణంలో నాకు స్ఫురించలేదు. ఒకవేళ తెగించానే అనుకుందాం. అయినా నా కుటుంబం ఈమెను స్వీకరించదు. సమాజం క్షమించదు. హర్షించదు. నా బతుకు సర్వనాశనమై పోతుంది.

ఆ విషయమే ఆమెతో నిర్మొహమాటంగా చెప్పాను. ఆమె కోపగించుకోలేదు. నిదానంగా, గంభీరంగా అంది. 'నా దురదృష్టాన్ని ఎవరూ ఏమీ చేయలేరు. ఆ విషయం నాకు ముందే తెలుసు. మీకు కూడా తెలిసొస్తుందని అలా అడిగాను. నాకు నిజంగానే తెలిసొచ్చింది. సంస్కరించడం సలహా ఇచ్చినంత సులభం కాదు. ఆ రాత్రి ఆమెను వదిలివెళ్తూ వంద రూపాయలిచ్చి, స్నేహితుడిగా ఇస్తున్నాను. కాదనకు' అన్నాను. ఆమె కృతజ్ఞతాపూర్వకంగా నా కళ్ళలోకి చూస్తూ తీసుకుంది.

తర్వాత ఆమె దగ్గరికి తరచూ వెళ్తూ వస్తున్నాను. రెండుమూడు సార్లు నాతో బయటకు తీసుకెళ్ళాను. అయితే ఆ ఇంటి యజమానురాలికీ, ఇతర ఏజంట్లకీ ఇవ్వవలసిన ముడుపులు చెల్లించిన తర్వాతే.

కానీ ఆమె సమస్య మాత్రం నన్ను ఛిద్రం చేస్తోంది. నేను ఈ ఊళ్ళో ఉన్నన్నాళ్ళూ ఆమె మరొకరిని వెతుక్కోనక్కర్లేదు. కానీ తర్వాత నాలాగా ఆమెను అర్థం చేసుకుని ఆదరించగల వారెవరొస్తారు? ఆమె తిరిగి ఆ మురికికూపంలో పడవలసిందే. కానీ ఆమెను అలా వదిలివెళ్ళడానికి మనసు అంగీకరించడంలేదు.

మా ఇద్దరి మధ్య రోజురోజుకీ అనుబంధం పెరుగుతూంది. నేను ఆమెను ప్రేమించినా, పెళ్ళి చేసుకుని ఇంటికి తీసుకువెళ్ళేంత మాత్రం కాదు. నాకు వెనకాల ఆస్తివుంది. నన్ను ఆదరించే సమాజం వుంది. ముందు మంచి భవిష్యత్తుంది. కానీ ఆమె నన్ను ప్రేమిస్తే మాత్రం చాలా భంగపడుతుంది. బహుశా ప్రాణత్యాగం కూడా చేసుకుంటుంది.

అలాంటి ప్రమాదం రాకుండా ఆమెను హెచ్చరిస్తూనే వున్నాను. ఆమె కూడా నా ఆవేదన అర్థం చేసుకుంది. ఆమెకు ఏదో ఒక సహాయం చేయాలని మాత్రం నేను అహోరాత్రాలు తపిస్తున్నాను.

అంతలో మా పై ఆఫీసర్ ఒకాయన ఇన్‌స్పెక్షన్‌కి వచ్చాడు. మా ఏరియాలో ఉన్న నలుగురు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ సాధించిన ఫలితాలు చూసి రిపోర్టు రాస్తాడు. మా మిత్రులు ఆయనకు మంచి హోటల్‌లో బస ఏర్పాటుచేసి మందు, మగువ అన్నీ సమకూర్చారు. ఆయన ఆ త్రీస్టార్ హోటలు సౌఖ్యాలన్నీ అనుభవించి మాకు మంచి సర్టిఫికెట్ ఇచ్చివెళ్ళాడు.

ఆయనను ఖుషీగా ఉంచడానికి అయిన ఖర్చులు పంచుకోవడంలో ఆయనకు ఆ రెండురోజులూ తోడుగావున్న లలనామణికి రెండువేలు ఇచ్చినట్టు తెలిసింది. ఆయనను తిరిగి పంపేవరకు ఆరువేలు ఖర్చయింది. కానీ మాకిచ్చిన సర్టిఫికెట్లు అంతకన్నా విలువైనవి. అందరం హాయిగా గాలి పీల్చుకున్నాం.




ఓ వారం రోజులు నేను నా వేశ్య స్నేహితురాలి దగ్గరకు వెళ్ళలేదు. అందువలన ఆ సాయంత్రం ఆత్రంగా ఆమె దగ్గరకు బయలుదేరాను. అప్పుడు హఠాత్తుగా నాకో విషయం స్ఫురించింది. మా ఆఫీసరుకోసం వెతికితెచ్చిన ఆ నటీ సుందరికంటే నా స్నేహితురాలు వెయ్యిరెట్లు అందమైనది. నేను సాహసించి అసలు నా స్నేహితురాలినే మా బాస్‌కు పరిచయంచేస్తే ఆ రెండువేలూ ఆమెకే ఇప్పించేవాణ్ణిగా.

కానీ వెంటనే పశ్చాత్తాపంతో కుమిలిపోయాను. ఆమె అంటే నాకు గౌరవం ఏర్పడింది. అనురాగం

కలిగింది. ఆమెను ఒక బజారువేశ్యగా ఊహించుకుని ఆమెకు అన్యాయం చేశాననిపించింది. ఆరోజు నన్ను కలిసి ఆమె మహదానంద భరితురాలైంది. నేను వచ్చేస్తూ ఆమెకు ఐదుపందలిచ్చాను. ఆమె తన కళ్ళను తనే నమ్మలేకపోయింది. "ఏమిటీ వెర్రి! ఎందుకింత డబ్బిచ్చారు?" అంది.

"నీ అందానికి విలువ కట్టాలంటే నా దగ్గర అంతకన్నా ప్రస్తుతం డబ్బులేదు అన్నాను" అప్రయత్నంగా.

ఆమె కన్నీళ్ళు పెట్టుకుంటూ "మీరు నాకు స్నేహితులుగా భావిస్తున్నాను. నా అందాన్ని చూడకండి. నా మనసుని చూడండి. మీ స్నేహానికి నేనెంత విలువ కట్టను?"

నా హృదయం ద్రవించింది. ఆమె నన్ను ప్రేమిస్తోంది. కనీసం ఒక విధమైన ఆత్మీయత పెంచుకుంటోంది. కానీ ఆమె వృత్తికి ఇవన్నీ అవరోధం. ఆమె వేశ్యావృత్తి అనే ఓ గుహలో అడుగుపెట్టింది. వేసిన అడుగులు వెనక్కి రావు. ఆ గుహకి రెండవద్వారం లేదు.

నా స్వరం గాద్గదికమైంది. నిగ్రహించుకుని అన్నాను. 'నిన్ను భార్యగా స్వీకరించలేని నన్ను గొప్ప స్నేహితుడిగా భావించకు. ఈ వృత్తిలో డబ్బు దగ్గర ఎప్పుడూ రాజీపడకు. ఈ పవిత్ర భారతదేశంలో తగినంత కట్నం ముట్టచెప్పందే ఒక్క యువకుడూ ఏ ఒక్క యువతినీ భార్యగా స్వీకరించడు. కానీ ఆ యువతి దగ్గరే ఎన్నివేలయినా పోసి సుఖం కొనుక్కుంటాడు. నీక్కావలసింది డబ్బు! ఎప్పటికైనా ఆ ధనమే నిన్ను ఈ దుస్థితి నుంచి తప్పించాలి" అయిష్టంగానైనా ఆమె ఆ డబ్బు తీసుకుంది. నేను ఆనందంగా నిట్టూర్చాను.

ఆ తర్వాత మూడు రోజులు నేనామెను కలవలేదు. ఎందుకంటే నా మస్తిష్కంలో ఓ పథకం రూపు దిద్దుకుంటూంది. అది ఆమెకు వివరించి ఆమెచేత వప్పించాలి. బహుశా అల్లా జరగదు. కానీ జరిగితీరాలి. కఠోరమైన వాస్తవాలకి, కఠినమైన పరిష్కారం తప్పదు. నా మనసులో ఓ నిర్ణయం కుదిరాక ఆమె దగ్గరకు వెళ్ళాను.

సాదరంగా ఆహ్వానించింది. ప్రేమగా నా చుట్టు అల్లుకుపోయింది. లతలా నా చుట్టూ పెనవేసుకున్న ఆమెను క్రూరంగా పెకలించివేస్తున్నానని తెలిసిన నేను లోపలలోపల కుమిలిపోయాను. కొంత సమయం గడిచాక అన్నాను.

'నీ సమస్యకి ఓ పరిష్కారం దొరికింది' అన్నాను.

'ఏమిటది?' అంది ఆమె ఉద్విగ్నతతో.

'నువ్వు వేశ్యగానే వుంటావు. కానీ ఖరీదైన వేశ్యగా!'

'అంటే!'

'అంటే నీ విలువ నీకు తెలియదు. తెలిసినా నీకు న్యాయంగా రావాల్సిన పారితోషికం రాదు.'

'మీ మాటలు నాకర్థం కావడంలేదు' అంది ఏదో భయంగా.

'ఉదాహరణకి అరణ్యాలలో నివసించే గిరిజనులున్నారనుకో. ఓ కంట్రాక్టరు అరణ్యంలో ఉన్న గంధపుచెట్టు కొట్టుకొని ఆ గిరిజనుడికి వంటచెరుకు రేటు మాత్రమే ఇస్తాడు. దాని విలువ తెలిసిన కాంట్రాక్టర్ అది లక్షలకు అమ్ముకుంటాడు. గిరిజనుడి అమాయకత్వాన్ని, అసహాయతని కంట్రాక్టరు దోచుకుంటాడు. మూడు నువ్వూ ఇప్పుడు నువ్వూ ఒక అరణ్యంలో ఉన్నావు. నువ్వు ఆ గిరిజనుడివి. నీ శరీరం ఆ గంధపుచెట్టు"

'నన్నెవరు దోచుకుంటున్నారు?' ఆమె అడిగింది కుతూహలంగా.

'నీ దగ్గరకు వచ్చే ప్రతివాడూ! ఈ ఇంటి యజమానురాలు, రిక్షావాడు'

'అందుకని?'

'నిన్నొక ఖరీదైన స్త్రీగా పెద్దవాళ్ళకు పరిచయం చేస్తాను. నీ అందానికి వేలకువేలు గుమ్మరిస్తారు'

'ఛీ! ఇదా మీ ఆలోచన! ఏదో చీకటిమాటువ గుట్టుగా పదిరాళ్ళు సంపాదించుకుని పొట్ట గడుపుకుంటుంటే నన్ను బజారుకెక్కించి పెద్దవేశ్యగా ప్రచారం చేస్తారా? నన్నవమానం పాలుచేస్తారా?"

నేను పెద్దగా నవ్వి అన్నాను.

"నువ్వు వేశ్యవని ఎలాగూ ముద్రపడింది. పది రూపాయలకి శరీరం అమ్ముకునే వేశ్యని ఎవరూ గౌరవించరు. అదే ఆమె కొంగు తగిలితేనే వేయి రూపాయలు ఖరీదు అంటే ఆ వేశ్యకు అందరూ హారతులు పడతారు"

"వద్దు. నన్నిలాగే బతకనివ్వండి" ఆమె ఏడుస్తూ అంది.

"కానీ ఇలాగా బతకలేవు. నిన్ను ఏ బొంబాయి, ఢిల్లీ, కలకత్తా వేశ్యాగృహాలకు అమ్మేస్తారు. నీ శరీరాన్ని అమ్మి వేలకువేలు సంపాదించి నీకు గంజినీళ్ళు పోస్తారు. అలా జరగదంటావ్. ఇక్కడే ఇంకో ఆర్నెల్లలో రోగాలతో కుళ్ళి చచ్చిపోతావు. నీ తల్లి, చెల్లి, తమ్ముడూ దిక్కులేని వాళ్ళవుతారు"

ఆమె భోరున ఏడుస్తూ నా ఒడిలో వాలిపోయింది. ఆమెను ఓదార్చి అన్నాను.

"ఇందులో నువ్వింతగా సిగ్గుపడవలసింది లేదు. సినీరంగంలో ప్రముఖులైన తారలు కొందరైనా ఈ రిన నడిచి కీర్తి సోపానాలు అధిరోహించినవాళ్లే రాజకీయ నాయకుల్లో నువ్వెవరినీ మోసం చేయడంలేదు. నీ అందానికి, శ్రమకి తగిన విలువ కట్టుకుంటున్నావ్. అంతే. ఈ రాత్రంతా ఆలోచించుకో. నేను మళ్ళీ వస్తా అని వచ్చేశాను.

* * *

మర్నాడు ఆమె నా సూచన అంగీకరించింది. ఆ రాత్రంతా ఎంత రోదించిందోకానీ నన్ను కలిసినప్పుడు ఆమె కళ్ళు మెరిశాయి. నన్ను మరిచిపోవాలని ఆమె ఓ కఠినమైన నిర్ణయం తీసుకుంది.

మరో వారం రోజులలో ఆమెను ఓ ఖరీదైన హోటలుకు తీసుకెళ్ళాను. ఆమెను బ్యూటీపార్లర్‌కి తీసుకెళ్ళి రూపురేఖలు మార్చేశాను. అలంకరణ మార్చేశాను. నా గర్ల్‌ఫ్రెండ్‌గా ప్రముఖులకి పరిచయం చేశాను. పార్టీలకీ, విందులకీ ఆహ్వానాలందుకున్నాము. బంగారం పొంగులువారే ప్రపంచంలో ఉదయించిన సూర్యుడిలా. ఆమె రోజురోజుకీ ఎదిగిపోతోంది. కనకం వర్షించింది. ఆమెను కొద్ది రోజులలో మోడల్‌గర్ల్‌గా పరిచయం చేశాను. చిత్ర నిర్మాతలదగ్గర నుంచి కూడా ఆహ్వానాలొచ్చాయి.

ఆమె ఈ కొత్త వాతావరణానికి అలవాటుపడి డబ్బు వ్యవహారాలు సరిగ్గా నిర్వహించుకుని పూర్తిగా తన స్వశక్తిమీద ఆధారపడగలదని నాకు విశ్వాసం కుదిరాక, ఆమె దగ్గర శలవు తీసుకుని మా ఊరు వచ్చేశాను. నేను చేసింది తప్పా? కాదని నా అంతరాత్మ చెబుతోంది. మీ అంతరాత్మ చెబుతుంది. కానీ లోకంకోసం 'తప్పే!' అనాలి. అంతే.

*



## సందేహం

సైన్స్ టీచర్ చెప్తుకు పోతోంది "ఆక్సిజన్... అంటే ప్రాణవాయువు. ఇది లేకుండా ప్రాణులు బతకవు. ఈ ఆక్సిజన్‌ని 1773లో కనుక్కున్నారు శాస్త్రవేత్తలు

"మరి అంతకు పూర్వం ఆక్సిజన్ బదులు 'ఏం పేల్చేవారు మేడం?"

"!?!"

—ఎస్. రవికుమార్
(ఉక్కునగరం)






## దురదృష్టం

ఎంతో ఐశ్వర్యంతో తులతూగిన సావిత్రి తాగితాగి నిరుపేదలా ఓ పెంకుటింట్లో కన్నుమూసింది.

హిందీనటి మీనాకుమారి చికిత్సకోసం ధర్మేంద్రను కూడా డబ్బుకోసం చేయిచాచి లేదనిపించుకుంది.

తెలుగు, హిందీ సినిమాలలో ఫైటింగ్‌సీన్‌లో కన్పడే బోడిగుండు 'షెట్టీ' చనిపోయేనాటికి అప్పులు తప్ప ఆస్తులుమాత్రం 'గుండుసున్నా' అట.

—నిష్ఠీల్